సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఈవీఎం గోదాం తనిఖీ



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, అధికారులు

ఆరిలోవ : రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన గోదాంను సందర్శించారు. గతంలో దానికి వేసిన సీలును పరిశీలించారు. గోదాం చుట్టూ, లోపల ఉన్న సీసీ కెమెరాల పనితీరు పరిశీలిచారు. గోదాం రక్షణ, భద్రతా ప్రమాణాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇక్కడ భద్రతా ప్రమాణాల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్, ఎన్నికల విభాగం సిబ్బంది ఉన్నారు.

నేల కూలిన బోర్డు



విశ్వప్రియ ఫంక్షన్ హాలు వద్ద నేల కూలిన బోర్డు

ఏయూ క్యాంపస్ : బీచ్‌రోడ్డులో వ్యాపార ప్రకటనలు ప్రసారం చేయడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్లోసైన్ బోర్డు నేలకూలింది. చాలా కాలం క్రితం బీచ్‌రోడ్డులో లాన్‌ల వద్ద వీటిని ఏర్పాటు చేశారు. వీటిపై వివిధ వ్యాపార ప్రకటనలు ప్రచారం చేసేవారు. తర్వాతి కాలంలో రోడ్డు మధ్యలో డివైడర్‌పై ఉన్న విద్యుత్ దీప స్తంభాలపై ప్రకటన బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో లాన్‌లో గతంలో ఏర్పాటు చేసిన వాటిని వినియోగించడం మానేశారు. అప్పటి నుంచి అవి తుప్పుపట్టి కూలిపోతున్నాయి. ప్రస్తుతం విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌కి చేరువలో ఉన్న ఒక ప్రకటనల బోర్డు కూలిపోయింది. దీనిని జీవీఎంసీ సిబ్బంది తొలగించకుండా అలానే వదిలేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జిల్లా సహకార అధికారికి కార్యవర్గ జాబితా అందజేస్తున్న వెంకటరావు తదితరులు

మహారాణిపేట: జిల్లా ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల మ్యూచువల్ ఎయిడెడ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా దాసరి వెంకటరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.రమణ, కోశాధికారిగా కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎ.వి. శ్రీను ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మంగళవారం జిల్లా సహకార శాఖ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి కార్యవర్గ సభ్యులను పరిచయం చేసింది.

జూలో చిత్రలేఖన పోటీలు



జూలో చిత్రలేఖన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పులులపై చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు నగరంలోని పలు పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూ అధికారులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పర్యావరణంలో పులులు కీలక జాతులని తెలిపారు. విశాఖ జూలో రాయల్ బెంగాల్ టైగర్స్, తెల్ల పులులు సందర్శకులను అలరిస్తున్నాయని తెలిపారు. పులులపై అవగాహన కల్పించడానికి జూలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. అనంతరం పులులకు సంబంధించిన డాక్యుమెంటరీని స్క్రీన్‌పై విద్యార్థులకు ప్రదర్శించారు. కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యలో ఆపేశారు

- నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణాలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజల కోసం ప్రారంభం
- కూటమి ప్రభుత్వం రాగానే పనులు నిలిపేసిన అధికారులు
- భవనాలు అందుబాటులోకి రాక ప్రజలకు ఇబ్బందులు



పదమూడో వార్డు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో మధ్యలో నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణం

ఆరిలోవ : ప్రజా అవసరాల కోసం నిర్మిస్తున్న భవనాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. కొద్ది రోజుల్లో అందుబాటులోకి వస్తాయని ఎదురు చూసే సౌకర్యాలు ప్రజలకు అందకుండా పోతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు సౌకర్యాలు దూరమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వంలో మధ్యలోనే దురుద్దేశంతో నిలిపేస్తున్నారు. తూర్పు నియోజకవర్గం పరిధి జోన్ – 2లో 9, 10, 11, 12, 13వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో అవి స్థానికులకు వినియోగంలోకి రాకుండా పోతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభమయ్యాయనే ఆలోచనతో కూటమి నాయకుల ఆదేశాలతో అధికారులు పనులు మధ్యలో నిలిపేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంపై కోపంతో కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తోందని అంటున్నారు. కూటమి కక్ష సాధింపు చర్యలు కారణంగా ప్రజలకు సౌకర్యాలు అందుబాటులోకి రాకుండా పోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యలో నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

రూ.30 లక్షలతో అసంపూర్తిగా...

జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్ లే అవుట్ పక్కన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో సామాజిక భవనం నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఈ కాలనీలో 14 బ్లాకులలో సుమారు 448 నివాసాలున్నాయి. వారంతా పేదలు కావడంతో వారికి ప్రత్యేకంగా సామాజిక భవనం నిర్మించాలని భావించి 2023లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.30 లక్షలు ఎంపీ నిధులతో పనులు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ సామాజిక భవన పనులు కూడా చతికిలపడ్డాయి. నిధులు చాలవనే నెపంతో పూర్తిగా నిర్మాణ పనులు నిలిపేశారు. దీంతో గోడలు, శ్లాబుకే ఈ భవనం పరిమితమైంది. దీని నిర్మాణం పూర్తయితే జేఎన్‌ఎన్‌యూఆర్‌ం కాలనీలోని 448 కుటుంబాలతోపాటు పక్కనే ఉన్న 40 గజాల కాలనీ, శివాజీనగర్ – 2, భగత్‌సింగ్‌నగర్ ప్రాంతాల వారికి సైతం ఉపయోగపడనుంది.

రూ.75 లక్షల పనులకు కూటమి గ్రహణం



జీవీఎంసీ తొమ్మిదో వార్డు జోడిగుళ్లపాలెంలో సగంలో నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణం

జీవీఎంసీ తొమ్మిదో వార్డులో సామాజిక భవనం నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. వార్డు పరిధి జోడుగుళ్లపాలెంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సామాజిక భవనం పనులను పూర్తి చేయకుండా మధ్యలో నిలిపేశారు. దీన్ని పూర్తి చేయాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకటస్వాతి జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు పలుసార్లు వినతిపత్రాలు అందించారు. అయినా ఇంతవరకు అధికారులు స్పందించ లేదు. జోడుగుళ్లపాలెంలో బీచ్ రోడ్డును ఆనుకుని సామాజిక భవనం నిర్మాణం కోసం 2022లో రూ.75 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో జీవీఎంసీ డబ్బులు రూ.50 లక్షలతోపాటు మరో రూ.25 లక్షలు ఎంపీ నిధులు మంజూరయ్యాయి. కొద్ది రోజుల తర్వాత పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు జరుగుతుండగా 2024 ఏప్రిల్‌లో సాధారణ ఎన్నికలు జరగడం.. కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఈ నిర్మాణానికి గ్రహణం పట్టింది. అప్పటి నుంచి భవన నిర్మాణం గురించి అధికారులు పట్టించుకోలేదు. రెండు అంతస్తుల్లో శ్లాబులు, గోడలు నిర్మించి తలుపులు, కిటికీలు, గచ్చులు చేయకుండా వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమయంలో చేపట్టిన భవనం కావడంతో కూటమి నాయకులు అధికారులతో పనులు జరిపించకుండా వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే జోడుగుళ్లపాలెం మత్స్యకార వాసులకు కార్యక్రమాలు చేసుకోవడానికి అందుబాటులోకి రానుంది. దీని కోసం ఇక్కడ మత్స్యకార కుటుంబాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి.

దిష్టిబొమ్మలా రూ.80 లక్షల భవనం



పన్నెండో వార్డు ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్ వెనుక మధ్యలో నిలిచిపోయిన సామాజిక భవన నిర్మాణం

జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి పాత పోలీస్ స్టేషన్ వెనుక నిర్మాణంలో ఉన్న సామాజిక భవనం పనులు కొన్నాళ్లుగా నిలిచిపోయాయి. సామాజిక అవసరాల కోసం స్థానికులకు ఉపయోగడేలా ఇక్కడ సామాజిక భవనం నిర్మించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ అధికారులు సుమారు రూ.80 లక్షలతో పనులు ప్రారంభించారు. ఆ పనులు సగం జరిగేలోగా 2024లో సాధారణ ఎన్నికలు రావడం... అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి దీని నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. సుమారు 250 చదరపు గజాల విస్తీర్ణంలో ఇక్కడ నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా శ్లాబు, గోడలు నిర్మించి తలుపులు అమర్చారు. ఇంకా కిటికీలు, వాటికి తలుపులు అమర్చాల్సి ఉంది. దీంతోపాటు ఫ్లోరింగ్, కరెంట్ వైరింగ్ తదితర పనులు మిగిలి ఉన్నాయి. ఇంతలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో మిగిలిన పనులు జరపకుండా అధికారులు వదిలేశారు. దీంతో సగం పనులకే పరిమితమైన ఈ భవన నిర్మాణం దిష్టబొమ్మలా మిగిలిపోయింది. ఇది అందుబాటులోకి వస్తే నెహ్రూనగర్, లీలాసుందరినగర్, దుర్గానగర్, రాజీవ్‌నగర్, కనకదుర్గానగర్, న్యూ అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతవాసుల అవసరాలకు ఉపయోగపడుతుందని స్థానికులు అంటున్నారు. ఈ భవనం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని ఆయా కాలనీల వాసులు ఎదురు చూస్తున్నారు.

ఆస్పత్రుల్లో పారదర్శక సేవలకు వినతి



డాక్టర్ రాధారాణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్టు 2010ని జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, ఆరోగ్య సేవలపై సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్ కోరింది. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణికి కౌన్సిల్‌కు చెందిన కె.రాము వినతిపత్రం సమర్పించారు. ఆస్పత్రులు ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 2010 రూపొందించారని రాము మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పలువురు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తొలుత కార్యాలయం ముందు పోస్టర్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయ విద్యావిధానంపై వెబినార్



వెబినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ధర్మారావు

ఎంవీపీ కాలనీ: జాతీయ విద్యావిధానం అమలులోకి వచ్చి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ఆధ్వర్యంలో వెబినార్ నిర్వహించారు. ఇగ్నో విశాఖ ప్రాంతీయ కార్యాలయంలో సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఆన్‌లైన్‌లో పాల్గొని జాతీయ నూతన విద్యావిధానం అమలు, అందుబాటులో ఉన్న కోర్సులు, విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి జరుగుతున్న ప్రోత్సాహం వంటి అంశాలను వివరించారు. ఎన్‌ఈపీ – 2020 విద్యార్థుల భవిష్యత్‌కు ఎలా దోహదం చేస్తుందో తెలియజెప్పారు. ఈ వెబినార్‌లో అస్సాం విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర ఆచార్యుడు డాక్టర్ పి.కనకారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నట్లు ధర్మారావు వెల్లడించారు. పలువురు విశాఖ ప్రాంతీయ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

హామీలన్నీ చంద్రబాబు గాలికొదిలేశారు

- ఏడాది కాలంగా మాయమాటలతో ప్రజలను మోసగిస్తున్నారు
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



పన్నెండో వార్డు బి.టి.ఆర్.నగర్‌లో మహిళతో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు



పదో వార్డు రాజీవ్‌నగర్‌లో మహిళలకు కరపత్రం అందజేస్తున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ : నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. జీవీఎంసీ 10, 12, 13వ వార్డుల్లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలు వివరించారు. పదో వార్డు రాజీవ్‌నగర్‌లో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు వివరించారు. అధికారంలోకి వచ్చేందుకు ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిన కూటమి నాయకులు ప్రజలను మోసం చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలన్నీ గాలికొదిలేశారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా మాయ మాటలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, స్థానిక నాయకులు వైదా నారాయణరావు, బొండా శ్రీను, పతివాడ వెంకటలక్ష్మి, వరలక్ష్మి, శ్రీహరి, శశికుమార్, కుమారి, రత్తయ్య, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

- 12వ వార్డులో సూర్యతేజానగర్, బీటీఆర్ నగర్‌లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి కాలనీలోని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొల్లి హేమంత్, లవనకుమార్, సూర్యారావు, అప్పలరాజు, సంజీవి, వరహాలు, లక్ష్మణ్, కేశవ తదితరులు పాల్గొన్నారు..
- 13వ వార్డు సాయినగర్‌లో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కూటమి పాలన వైఫల్యాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, గూడపాటి విక్టర్, ప్రసంగి వాసు, బేత దుర్గారావు, సాగరిక, జగదీష్, వానపల్లి, ఈశ్వరరావు, పి.బంగార్రాజు, కాకర గోవింద్, బాబూరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి తీవ్ర నష్టం

ఎంవీపీ కాలనీ : ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కల్పించారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వర్యంలో ఉషోదయ కూడలిలోని జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం దుర్గాకుమారి, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కారణంగా భూవాతావరణానికి, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఏటా లక్షల టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ భూ పొరల్లో నిలిచిపోతుందన్నారు. ఏళ్ల తరబడి ఇవి మట్టిలో కలవకుండా కాలుష్యాన్ని పెంచుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చిరుధాన్యాలతో రాఖీలను తయారు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దే వద్దు అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

ఇంటింటికీ కూటమి ప్రభుత్వం మోసాలు

- విస్తృతంగా 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు



28వ వార్డు భానోజీనగర్‌లో మహిళకు కరపత్రం అందిస్తున్న పల్లా దుర్గారావు, నాయకులు



22వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ 16వ వార్డు నాయకులు, కార్యకర్తలు

బీచ్‌రోడ్డు : కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తుందో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అర్థమయ్యేలా వివరిరచి చైతన్యపరుస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు అన్నారు. జీవీఎంసీ 28వ వార్డు భానోజీనగర్ బూత్ నంబర్ 195, 196లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చంద్రబాబు చేసిన మోసాలను పొందుపరచిన కరపత్రాలను గడప గడపకు వెళ్లి అందజేశారు. గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసం తెలియజేశారు. జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పులగం కొండారెడ్డి, వార్డు అధ్యక్షుడు రాపాక శ్రీనివాస్, సంపంగి సురేష్, కోన కామేశ్వరరావు, బంగారు భవానీశంకర్, తెలుగు చంద్రరావు, కొండ్రు అప్పారావు, అడపాక మునీంద్రనాథ్, సోమదుల అప్పలరాజు, తెలుగు వాణి, మున్నప్పగారి ఈశ్వరి, నదిమిపిల్లి రమణ, నమ్మి రామకృష్ణ, నమ్మి అప్పారావు పాల్గొన్నారు.

16వ వార్డులో పోస్టర్ల ఆవిష్కరణ

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' పోస్టర్లు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఆదేశాల మేరకు వార్డు అధ్యక్షుడు బొల్లంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. బుధవారం నుంచి 16వ వార్డులోని ప్రతీ గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు పాలనలో మోసపోయిన విధానాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మహిళ అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, యూత్ అధ్యక్షుడు కొంగరాణి రాంబాబు, వేములవలస అప్పారావు, బుగత మధు, గొలగాని కన్నారావు, మీసాల ప్రదీప్, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఫిరోజ్, చింత వెంకటరావు, సంధ్య, బమ్మిడి జోగారావు, వేణుగోపాల్ రెడ్డి, నరేష్ రెడ్డి, జోగా ప్రసాద్, సత్యనారాయణ, మెట్ట సూర్యనారాయణ, మమత, మంగాదేవి, దల్లి రాజు, ముదిలి శ్రీను, కమల్ పాల్గొన్నారు.

జీవీఎంసీ 22వ వార్డులో...

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు శివాజీ పాలెం బూత్ నంబర్ 145లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను పొందుపరచిన కరపత్రాలు అందించారు. బూత్ అధ్యక్షుడు బోర రామిరెడ్డి, పీతల మహేష్, చేనేత విభాగం తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు సూరిశెట్టి రావాలు, స్తంబాల లక్ష్మి, అన్నపూర్ణ, శివ కుమార్ రాజు, నీలపు మురళి పాల్గొన్నారు.

న్యాయం కోరితే.. కరెంట్ కోతలా..!

- విడ్డూరంగా జోన్ – 3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ తీరు
- కార్పొరేటర్ వేధింపులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు 22వ వార్డు నివాసి ఫిర్యాదు
- మరుసటి రోజే ఫిర్యాదుదారుడి బడ్డీకి కరెంట్ కనెక్షన్ తొలగించాలని జెడ్సీ ఆదేశాలు జారీ
- జీవీఎంసీ అధికారుల తీరుపై నివ్వెరపోతున్న రజకవీధి వాసులు



కోర్టు ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్ కాపీ



జెడ్సీ శివప్రసాద్ జారీ చేసిన ఆదేశాలు

మద్దిలపాలెం : కార్పొరేటర్ వేధింపులు భరించలేకపోతున్నామని... సచివాలయం సిబ్బంది కాలువ నిర్మించడం లేదని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై అధికారులు కక్ష కట్టారు. ఏకంగా ఫిర్యాదుదారుడి బతుకుతెరువుకు ఆధారమైన బడ్డీకి విద్యుత్ సరఫరా కనెక్షన్ తొలగించాలంటూ జోనల్ కమిషనర్ నేరుగా ఈపీడీసీఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే... జీవీఎంసీ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ వ్యవహారశైలిపై కొద్ది కాలంగా స్థానికులు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. సుమారు రెండు నెలల క్రితం డ్రైనేజీల నిర్మాణం కోసమని భారీ వృక్షాలు నిర్దాక్షిణ్యంగా తొలగించడంపై అప్పట్లో స్థానికులతోపాటు పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్థానిక కళాభారతి రోడ్డులోని రజకవీధికి వెళ్లే రోడ్డును తవ్వి అప్పటి నుంచి అలానే వదిలేశారు. వాస్తవానికి ఇక్కడ డ్రైనేజీ నిర్మాణం పూర్తిచేసేసి... తవ్వేసిన రోడ్డు పునర్నిర్మించేస్తే స్థానికుల రాకపోకలకు సులువుగా ఉండేది. అయితే గతంలో జరిగిన కొన్ని పరిణామాలను మనసులో పెట్టుకున్న కార్పొరేటర్ మూర్తియాదవ్ ఒత్తిడి మేరకు అధికారులు ఈ రోజుకీ రజకవీధికి వెళ్లే మార్గం వద్ద కాలువ నిర్మించలేదు. ఈ వివాదం, కక్షపూరిత వ్యవహార శైలిపై స్థానిక నివాసి నేతల కనక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ వేధిస్తున్న తీరు, స్థానిక సచివాలయం అధికారుల నిర్లక్ష్యంపై ఆ ఫిర్యాదులో తెలియజేశారు.

జెడ్సీ శివప్రసాద్ తీరుపై విమర్శలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేసిన మరుసటి రోజే సదరు ఫిర్యాదుదారుడి బడ్డీకి విద్యుత్ సరఫరా కనెక్షన్ తొలగించమని జోన్ – 3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ నోటీసులు జారీ చేయడం వివాదాస్పదమైంది. ఇదేం పాలన బాబోయ్ అంటూ రజకవీధి వాసులు నివ్వెరపోతున్నారు. కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ వేధింపుల నుంచి రక్షించి న్యాయం చేయండి బాబు అని వేడుకున్న పాపానికి ఏకంగా కూడు పెడుతున్న బడ్డీనే అక్రమమంటూ నోటీసులు జారీ చేసి వేధిస్తారా అని వాపోతున్నారు. సుమారు 60 ఏళ్లగా స్థిర నివాసముంటూ.. 40 ఏళ్లగా బడ్డీకి పన్ను, విద్యుత్ బిల్లు కడుతున్నామని బాధితుడు నేతల కనక మీడియాకు తెలియజేశారు. మా నివాసానికి సంబంధించి కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కలిగి ఉన్నామని... అయినప్పటికీ కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఈపీడీసీఎల్ అధికారులను జెడ్సీ శివప్రసాద్ తమపైకి ఉసిగొల్పడం విడ్డూరంగా ఉందని వాపోయారు. 22వ వార్డులో మూడు అడుగుల రోడ్డులో అక్రమంగా నిర్మించిన ఐదు అంతస్తుల భవనం, రజకవీధికి కూతవేటు దూరంలో ఏకంగా రోడ్డును మూసేసి నిర్మించిన భారీ భవనం జీవీఎంసీ అధికారులకు కనిపించకపోవడం విచారకరమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయమని జీవీఎంసీ కమిషనర్‌ను సోమవారం అభ్యర్థిస్తే... మంగళవారం తెల్లారేసరికి తమ బడ్డీపైకి విద్యుత్ శాఖ అధికారులను జోనల్ కమిషనర్ ఉసిగొల్పారని నేతల కనక వాపోయారు. అయితే విద్యుత్ కనెక్షన్ తొలగింపునకు వచ్చిన విద్యుత్ శాఖ సిబ్బందికి కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ చూపించడంతో వెనుతిరిగారు.